ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



గిరిజన జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం
గిరిజనుల జీవన ప్రమాణాలు పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. పుల్లలచెరువు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. - 8లో..



గడప గడపలో ఆనందం
ప్రభుత్వ పథకాలతో గడప గడపలో ఆనందం నిండిందని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. - 8లో..

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 36/28
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉమ్మడి ప్రకాశం జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక పూర్తి


బూదవాడ గ్రామంలో ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

జే.పంగులూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక శనివారం మండల పరిధిలోని బూదవాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ ఎంపిక కార్యక్రమం పాఠశాల హెచ్‌ఎం బంగారు కొండ, పీడీ వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగింది. 12 నియోజకవర్గాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-17, అండర్-14 విభాగాల్లో బాలబాలికలకు సంబంధించిన నాలుగు జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌పీఈ అసోసియేషన్ సెక్రటరీ నత్తన కృష్ణ, సభ్యులు వేణుగోపాల్ వెంకట్రావు తెలిపారు. క్రీడాకారుల ఎంపికను పీడీలు స్వరూపారాణి, శేషగిరి, రమేష్, సుబ్బలక్ష్మి, వెంకట్రావు ఎంపిక చేశారు. జట్టుకు 16 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు సింగరాయకొండ విద్యార్థిని


ఎంపికైన తులసిని అభినందిస్తున్న దృశ్యం

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చిమట తులసి అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ పద్మజ తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 15వ తేదీ అండర్-14 హాకీ పోటీల జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన తులసి జిల్లా జట్టుకు ఎంపికైంది. జిల్లా జట్టుకు ఎంపికైన తులసిని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.అన్వర్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ చిమట సుధాకరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

పశువుల కృత్రిమ గర్భధారణ పరికరాల పంపిణీ


పశువుల గర్భధారణ పరికరాలు పంపిణీ చేస్తున్న జేడీ డాక్టర్ బేబీ రాణి

ఒంగోలు సబర్బన్: పశువుల కృత్రిమ గర్భధారణకు సంబంధించిన కంటైనర్లు, పరికరాలను జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి పంపిణీ చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చీమకుర్తి మండలానికి చెందిన రైతు భరోసా కేంద్రాలు కేవీ పాలెం, ఇలపావులూరు, పి.నాయుడు పాలెం, మంచికలపాడు, చినరావిపాడు సిబ్బందికి అందజేశారు. ఆదివారం నుంచి ఆయా గ్రామాల్లో పాడి రైతులు, పశు వైద్య సహాయకుల ద్వారా కృత్రిమ గర్భధారణ సౌకర్యం కల్పిస్తున్నామని అధికారులు చెప్పారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని పాడిరైతులు ఆర్థికంగా లబ్ధిపొందాలని జేడీ బేబీరాణి కోరారు. కార్యక్రమంలో పశువైద్యులు షేక్ కాలేషా, కోసూరి రాధ, పశు వైద్యులు కృపారావు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రాజేశ్వరితో పాటు పలువురు పాల్గొన్నారు.

జై బోలో.. మట్టిగణేశా..

- మట్టిగణపతిని పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- 'చిన్నారుల చేతుల్లో మట్టిగణపతి' కార్యక్రమానికి విశేష స్పందన
- 'సాక్షి', ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంయుక్తంగా నిర్వహణ
- సాయిబాబా సెంట్రల్ స్కూల్, క్విస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు
- ప్రతిచోట మొదటి 5 స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులు అందజేత


సాయిబాబా సెంట్రల్ స్కూల్లో మట్టిగణపతి విగ్రహాలను తయారు చేస్తున్న చిన్నారులు


క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో మట్టి గణేశుడిని తీర్చిదిద్దుతున్న క్విస్ స్కూల్ విద్యార్థులు

ఒంగోలు: మట్టి గణపతిని పూజిద్దాం...పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో 'సాక్షి' మీడియా గ్రూప్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంయుక్తంగా నిర్వహించిన 'చిన్నారుల చేతుల్లో మట్టిగణపతి' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శనివారం నగర పరిధిలోని సాయిబాబా సెంట్రల్ స్కూల్, క్విస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని మట్టి వినాయక ప్రతిమలు తయారు చేశారు.

సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి రాఘవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడమే కాకుండా కళాజాతాలతో సామాజిక చైతన్యం తీసుకొస్తున్నామన్నారు.


క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన శిబిరంలో చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుడు

కాలుష్య నివారణ సామాజిక బాధ్యతగా భావించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకొచ్చిన 'సాక్షి' మీడియాకు, అదే విధంగా విద్యార్థులకు సాంకేతికతతో కూడిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవకాశం కల్పించిన సాయిబాబా సెంట్రల్ స్కూల్ యాజమాన్యానికి, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. మట్టి గణపతిని పూజించాలనే ఆలోచన చిన్నతనం నుంచే ప్రారంభమైతే అది భవిష్యత్‌లో అద్భుతమైన పర్యావరణ హితానికి తోడ్పడుతుందన్నారు. ఈ ఆలోచనతోనే రేపటి పౌరులలో ఒక మంచి మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సాయిబాబా సెంట్రల్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ జీవి భాస్కర్, ప్రిన్సిపాల్ ఎం.మహేష్ మాట్లాడుతూ ఒక మంచి అవగాహన కార్యక్రమానికి తమ స్కూలు వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. చిన్నతనంలో జరిగే కార్యక్రమాలు చిన్నారుల మనస్సులపై బలంగా ముద్రితమవుతాయని తద్వారా మార్పు తప్పక సాధ్యపడుతుందని ఆకాంక్షిస్తున్నామన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మట్టి గణపతి తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించగా చిన్నారులు వినాయక ప్రతిమలను రూపొందించారు. ఈ సందర్భంగా ప్రతిమలను అద్భుతంగా తీర్చిదిద్దిన మొదటి ఐదుగురికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' బ్రాంచి మేనేజర్ శివన్నారాయణ, సర్క్యులేషన్ మేనేజర్ పవన్‌కుమార్, ఎడిషన్ ఇన్‌చార్జి రవిచంద్ర, యాడ్స్ ఇన్‌చార్జి శేషిరెడ్డి, ఫొటోగ్రాఫర్ యం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో..
క్విస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్‌లో జరిగిన కార్యక్రమాన్ని క్విస్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ గాయత్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం నేడు సమాజానికి పెను సవాల్‌గా మారిందన్నారు. ఒక వైపు పెరుగుతున్న పారిశ్రామికీకరణ ఉపాధి అవకాశాలను పెంచుతుంటే రెండో వైపు అదే రంగం కాలుష్యాన్ని పెంచుతోందన్నారు. ఈ నేపథ్యంలో రెండింటి మధ్య సమతుల్యత ముఖ్యమని, అందుకు మనమంతా మొక్కలు పెంచడం ద్వారా వాతావరణంలో ఆక్సిజన్ శాతాన్ని పెంచవచ్చన్నారు. వినాయక విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వంటి వాటి వినియోగం తగ్గాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విగ్రహ తయారీపై విద్యార్థులకు అవగాహన కలిగించగా వారు బంక మన్నుతో విగ్రహాలను తయారు చేసి ఔరా అనిపించారు. ఈ సందర్భంగా మట్టి ప్రతిమలను అద్భుతంగా తయారు చేసిన ఐదుగురు విద్యార్థులకు బహుమతులు, మరో ఐదుగురికి మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ వై.హనుమంతరావు, క్విస్ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ దక్షిణామూర్తి, క్విస్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కె.నాగరాజు, 'సాక్షి' బీఎం శివన్నారాయణ, సర్క్యులేషన్ మేనేజర్ పవన్‌కుమార్, యాడ్స్ అసిస్టెంట్ మేనేజర్ శర్మ, క్విస్ కాలేజీ ఏవో సుదర్శన్ తదితరులు పర్యవేక్షించారు. చివరగా విజేతలకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆర్.సుశీల బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణంపై నేడు సమాజంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని, మెరుగైన పర్యావరణ పరిస్థితులు ఉన్న చోట ఆరోగ్యకర వాతావరణం ఉంటుందన్నారు.


సాయిబాబా సెంట్రల్ స్కూల్ విద్యార్థిని తయారు చేసిన మట్టిగణపతి


సాయిబాబా సెంట్రల్ స్కూల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి రాఘవరెడ్డి


క్విస్ కాలేజీలో మట్టిగణపతిపై అవగాహన కల్పిస్తున్న క్విస్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ గాయత్రీదేవి, ప్రిన్సిపాళ్లు హనుమంతరావు, నాగరాజు

ఆనందంగా ఉంది



మట్టిగణపతి విగ్రహాన్ని నా చేతులతో తయారుచేయడం ఆనందంగా ఉంది. ఇది ఎనలేని తృప్తిని కలిగించింది. మట్టి గణపతి విగ్రహాన్ని పూజించడం ద్వారా పర్యావరణానికి ఎంతోమేలు చేశామన్న ఆనందం కలిగింది.
– డి.గాయత్రి, మొదటి బహుమతి విజేత

పర్యావరణంపై ప్రతి ఒక్కరికీ అవగాహన



పర్యావరణంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం అనే విధానానికి హ్యాట్సాఫ్. చిన్న మొక్క పెద్ద చెట్టుగా మారి మంచి ఆక్సిజన్‌ను సమాజానికి ఎలా అందిస్తుందో అలాగే చిన్నతనం నుంచే పర్యావరణంపై అవగాహన కల్పిస్తే ఆహ్లాదకర, ఆరోగ్యకర వాతావరణాన్ని మేము రూపొందించుకుంటామన్న నమ్మకం మాకు కలిగింది.
– కె.జ్వాలా స్వరూప

మట్టి గణపతి ఎంతో మేలు



మట్టి గణపతి ఎంతో మేలు. నా చేతులతో తయారు చేసిన విగ్రహాన్ని పండుగ రోజు పూజించుకోవాలన్న ఆలోచన సంతోషాన్ని కలిగిస్తోంది. రసాయనాలతో చేసిన విగ్రహాలు చూసేందుకు అందంగా ఉన్నా అవి ప్రకృతికి చేసే హాని ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ మట్టిగణపతిని పూజించాలి.
– పి.కృతిక, ప్రథమ బహుమతి విజేత

జలచరాల ఉత్పత్తి దారుణంగా పడిపోతుంది



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వంటి వాటితో చేసిన విగ్రహాలను సముద్రాలలో నిమజ్జనం చేసినప్పుడు జల కాలుష్యం పెరుగుతుంది. దీనివల్ల సముద్రంలో ఉండే జీవులు చనిపోవడం, వాటి ఉత్పత్తిపై ప్రభావం కనిపిస్తుంది. తద్వారా జలచరాల ఉత్పత్తి దారుణంగా పడిపోతుంది. జల కాలుష్యానికి కారణమవుతున్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వంటి వాటి వినియోగాన్ని స్వచ్ఛందంగా మానుకునేందుకు ప్రజలు ముందుకు రావాల్సిన అవసరాన్ని తెలుసుకున్నా.
– యు.శివశంకర్, ద్వితీయ బహుమతి విజేత

పేద మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

- వైఎస్‌ఆర్ కాపునేస్తం 4వ విడత కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు
- జిల్లాలో 8,707 మంది లబ్ధిదారులకు రూ.13.6 కోట్లు జమ


కాపునేస్తం చెక్కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఇతర ప్రజాప్రతినిధులు

ఒంగోలు అర్బన్:

పేద కుటుంబాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని దానిలో భాగంగా వైఎస్‌ఆర్ కాపు నేస్తం పథకం కూడా మహిళల అభ్యున్నతికి ఉపకరిస్తుందని జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు అన్నారు. వరుసగా నాల్గవ ఏడాది అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో శనివారం నగదు జమ చేసే కార్యక్రమాన్ని తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించారు. దీనికి అనుబంధంగా జిల్లా స్థాయిలో ప్రకాశం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, రాష్ట్ర ఎస్‌సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట్ల రవిబాబు, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులకు అతిథులు బ్యాంకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్‌ఆర్ కాపు నేస్తం పథకం ద్వారా 45 నుంచి 60 సంవత్సరాలలోపు ఉన్న కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.15 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ పథకం ద్వారా 8,707 మంది లబ్ధిదారులకు రూ.13.06 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ ఈ నగదును మెరుగైన జీవనోపాధి కోసం వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

నగర మేయర్ మాట్లాడుతూ కాపుల సంక్షేమ కోసం ఎప్పుడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్నీ విధాలుగా చేయూతనిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం జగన్ అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి మాట్లాడుతూ వైఎస్‌ఆర్ కాపు నేస్తం పథకం పేద కుటుంబాల్లో మహిళల ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడుతుందన్నారు. కాపులను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు.

గిరిజన జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం


లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు/యర్రగొండపాలెం: గిరిజనుల జీవన ప్రమాణాలు పెంపొందించడమే తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం పుల్లలచెరువు మండలంలోని నరజాముల తండాలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మాట్లాడారు. ముందుగా రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను అమలు పరచి అన్ని వర్గాలకు చెందిన పేద ప్రజలకు లబ్ధి చేకూర్చుతున్నారని చెప్పారు. ఈ పథకాలు సక్రమంగా అమలు చేసేందుకు వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ప్రజలకు ఇంకా ఏమైన సమస్యలు ఉన్నాయా అని తెలుసుకొని తక్షణమే పరిష్కరించటానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరవాత ప్రజలు ఏమేరకు లబ్ధి పొందారు, ఇంకా ఏమైనా అవసరం ఉందా అని ఆయన అడికి తెలుసుకున్నారు. పథకాలను క్రమం తప్పకుండా అమలు పరుస్తుంటే.. ప్రతిపక్షాలు మాత్రం గగ్గోలు పెడుతున్నాయని, లబ్ధిదారుల అకౌంట్‌లలో నేరుగా నగదు జమ చేయడం ఇష్టంలేని టీడీపీ నాయకులు రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలో నెట్టి వేస్తున్నారని విమర్శలకు దిగారని చెప్పారు. ఏదో ఒక విధంగా సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేరకుండా చేయాలన్నదే వారి ప్రధాన ధ్యేయమని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పింది చేస్తారని, ఆ మాట నిలబెట్టుకోవటానికి ఎంత దూరమైనా వెళ్తారని, ఖర్చుకు ఏమాత్రం వెనుకాడరన్నారు.

కోట్లాది రూపాయలు మింగేసినా..

టీడీపీ ప్రభుత్వ కాలంలో కోట్లాది రూపాయలు మింగేశారని, అయినప్పటికీ వారు తృప్తి పడకుండా రాష్ట్రాన్ని దోచుకోవటానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రజల ధనాన్ని దోపిడీ చేసిన చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్నాడని, ఆయనను బయటికు తీసుకు రావటానికి వాటాదారులంతా ఒక్కటయ్యారని వ్యంగ్యంగా అన్నారు. తప్పు చేసినవారిని చట్టం ఏ మాత్రం వదలిపెట్టదని, తన పని తాను చేసుకుంటూ పోతుందనటానికి చంద్రబాబు అరెస్టే ఉదాహరణ అని చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఆయన వృద్ధులను సైతం వదలి పెట్టకుండా జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి గ్రామ స్థాయి నుంచి పచ్చ నేతలు దోచుకునే విధంగా సహకరించారని విమర్శించారు. వయస్సు ఉడికిపోయిన వారు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే తమ పార్టీ కండువా కప్పుకోవాలని వేధించేవారని, తమ ఇంటి చుట్టూ తిప్పుకుంటూ వారి అంతిమ రోజుల వరకు కూడా పింఛన్ మంజూరు చేసేవారు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఉసురు తగలడం వల్లనే చంద్రబాబు ఇప్పుడు జైల్లో ఊచలు లెక్కపెడుతున్నాడన్నారు. ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ వాగ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు బి.వి.సుబ్బారెడ్డి, జిల్లాపరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాష, సర్పంచ్ బాలునాయక్, నాయకులు యండ్రపల్లి సుబ్బారావు, కృష్ణనాయక్, బి.బాలు నాయక్, తహసిల్దార్ కె.దాస్, ఎంపీడీవో ఎం.మరియదాసు, హౌసింగ్ డీఈ సురేష్‌బాబు, ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి, ఏపీఎం వెంకటయ్య, ఏఈలు జాన్‌సుందర్, ప్రకాష్, కిషోర్, హనుమాన్‌బాబు పాల్గొన్నారు.

గడప గడపలో ఆనందం

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- చింతాయగారిపాలెం, పెద దేవరంపాడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

నాగులుప్పలపాడు (ఒంగోలురూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం నెలకొందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు మండలం చింతాయగారిపాలెం, పెద్ద దేవరంపాడు గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బాలినేనికి ఘన స్వాగతం పలకగా మహిళలు హారతులు ఇచ్చి తిలకం దిద్దారు. తొలుత బాలినేని చింతాయగారిపాలెంలోని ఎల్లమ్మతల్లి, రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాలినేని ప్రతి ఇంటికి ప్రభుత్వ లబ్ధి బుక్‌లెట్ అందజేసి మాట్లాడారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు సంతోషంగా తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా లబ్ధిదారులకు నగదు ఖాతాల్లో జమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చింతాయగారిపాలెంలో 5 డ్వాక్రా సంఘాలకు మంజూరయిన రూ.20 లక్షల చెక్కును లబ్ధిదారులకు బాలినేని అందజేశారు. బాలినేనికి నాగులుప్పలపాడు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అమ్మనబ్రోలు, వినోదరాయునిపాలెం గ్రామాల్లో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు దారా పద్మజ, వారా వీర్రాజు ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు, నాగులుప్పలపాడు ఎంపీపీలు పల్లపోలు మల్లికార్జున్‌రెడ్డి, నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చుండూరి రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, గ్రామ సర్పంచ్ నాయుడు శ్రీరాములు, కరవది పీఏసీఎస్ అధ్యక్షుడు వాకా కృష్ణారెడ్డి, లిడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, పోలినేని కోటేశ్వరరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, అయ్యపురెడ్డి, షేక్.సల్మా, కోయి హనుమయ్య, పోద పవన్‌కుమార్, ఘట్టమనేని అశోక్, త్రినాథ్‌రెడ్డి, చెరుకూరి రమేష్, చప్పిడి సోమశేఖర్, పల్లెర్ల అంజిరెడ్డి, మన్నె శ్రీనివాసరావు, ఈదర చిన్నారి, వడ్లమూడి మురళీ, బ్రహ్మయ్య, వెంకట సుబ్బయ్య, రాజీవ్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


భారీ ర్యాలీతో వస్తున్న బాలినేని

రోడ్డు నిర్మాణానికి వినతి

నాగులుప్పలపాడు మండలంలోని కనపర్తి–నాగులుప్పలపాడు వరకు 16 కి.మీ మేర ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయమైందని, చిన్నంగారిపట్టపుపాలెంలో విద్యుత్ లైన్ సమస్యను నాగులుప్పలపాడు ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి బాలినేని దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులకు రోడ్డు నిర్మాణంతో పాటు విద్యుత్ సమస్యపై త్వరితగతిన చర్యలు చేపట్టాలని తెలిపారు.

క్యాండిల్ ర్యాలీ పేరుతో తెలుగు మహిళల రచ్చ

- మహిళలను అడ్డం పెట్టుకొని ఉద్రిక్తతలు సృష్టించేందుకు దామచర్ల జనార్దన్ కుయుక్తులు
- ఎస్సై ఫాతిమాపై బెదిరింపులకు దిగిన దామచర్ల సతీమణి నాగసత్యలత
- డీఎస్పీని నెట్టేసి, ఎస్సైను లాగి పడేసి, మహిళా కానిస్టేబుల్‌ను కొరికిన తెలుగు మహిళలు
- ట్రాఫిక్‌జాంతో ప్రజల ఇబ్బందులు
- ఆందోళనకు గురైన మహిళలు


పోలీసులతో వాదనకు దిగిన దామచర్ల

ఒంగోలు టౌన్: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రాజమండ్రి జైలులో రిమాండ్‌లో ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు మద్దతుగా నగరంలో తెలుగు మహిళలు చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. శనివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో కర్నూలురోడ్డులోని ఫ్లెక్టోవర్ బ్రిడ్జి వద్ద నుంచి తెలుగు మహిళలు అద్దంకి బస్టాండ్ సెంటర్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీసుల అనుమతి లేదని పోలీసులు చెబుతున్నా లెక్క చేయకుండా ర్యాలీ చేపట్టారు. టీడీపీ కార్యాలయం వద్ద ఉన్న దామచర్ల జనార్దన్ ర్యాలీకి బయలు దేరుతున్నట్టు సమాచారంతో సిబ్బందితో కలిసి ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి అక్కడికి చేరుకున్నారు. ర్యాలీకి అనుమతి లేదని నోటీసులు ఇచ్చారు. అయితే నేను ర్యాలీలో పాల్గొనడం లేదని, పార్టీ పనిపై గుంటూరుకు వెళుతున్నాని చెప్పిన దామచర్ల కారులో బయలుదేరి కేబీ దగ్గరకు రాగానే కారులోంచి దిగి ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో అక్కడికి వచ్చిన డీఎస్పీ నారాయణస్వామిరెడ్డిని తెలుగు మహిళలు చుట్టుముట్టి నెట్టివేశారు. అడ్డుకోబోయిన ఎస్సై శ్రీకాంత్‌ను లాగిపడేశారు. ఒక మహిళా కానిస్టేబుల్‌ను తెలుగు మహిళ ఒకరు చేయిపట్టుకొని కొరికారు. దామచర్ల జనార్దన్ భార్య నాగసత్యలత నేనేం తక్కువ అంటూ ఎస్సై షేక్ ఫాతిమాతో వాగ్వాదానికి దిగారు. రాబోయేది మా ప్రభుత్వమేనని, నీ సంగతి తేలుస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ర్యాలీ దెబ్బకు ఆర్టీసీ బస్టాండ్, అద్దంకి బస్టాండ్ సెంటర్, కేబీ వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆ సమయంలో అటుగా వచ్చిన 108ను కూడా అడ్డుకొన్నారు. అయితే ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు చేరుకునే లోపే దామచర్ల అక్కడ నుంచి చల్లగా జారుకున్నారు. దీంతో బిత్తరపోయిన మహిళా నాయకురాళ్లు తమకెందుకులే అని క్యాండిల్‌లు వెలిగించకుండానే వెనుదిరిగారు.

తుస్సుమన్న ర్యాలీ...

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ తెలుగు మహిళలు చేపట్టిన క్యాండిల్ ర్యాలీ తుస్సుమంది. తొలుత మంగమూరు డొంక నుంచి వెయ్యి మంది మహిళలతో ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. కానీ కార్యకర్తల నుంచి స్పందన లేకపోవడంతో ర్యాలీ ఆలస్యంగా 7 గంటలకు ప్రారంభమైంది. కేవలం 100 మంది మాత్రమే తెలుగు మహిళలు ర్యాలీకి వచ్చారు.


మహిళా ఎస్సై షేక్ ఫాతిమాను బెదిరిస్తున్న దామచర్ల సతీమణి నాగసత్యలత

ర్యాలీ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగానే పోలీసుల కళ్లుగప్పి కర్నూలు ఫ్లెక్టోవర్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఫోన్లు చేసి బతిమాలుకొని మరికొందరిని పిలిపించుకున్నారు. చివరికి 150 మంది మహిళలతో ర్యాలీకి బయలుదేరారు. చివరికి ర్యాలీకి వచ్చిన ఆ కొద్ది మంది మహిళా నేతలు కూడా తలా ఓ దిక్కుకు పారిపోయారు. ఇదిలా ఉండగా కొందరు మహిళా నాయకురాళ్లను అదుపులోకి తీసుకున్న తాలుకా పోలీసులు నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారని కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంభం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రాజేష్ వివరాల ప్రకారం.. ఆర్టీసీ కంట్రోలర్ 108కు సమాచారం అందించడంతో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం మార్కాపురం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి గురించి ఎటువంటి సమాచారం లేదని ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

ముగిసిన జేసీఐ వారోత్సవాలు

- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న జేసీఐకు తన సహకారం ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. గత వారం రోజులుగా కాపు కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న జేసీఐ వారోత్సవాలు శుక్రవారం అర్ధరాత్రి ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రసంగిస్తూ ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలను నిర్వహించడం సంస్థ నిబద్ధతకు నిదర్శనం అని కొనియాడారు. రేపటి దేశ భవిష్యత్తు నేటి విద్యార్థుల మీదే ఉందన్నారు. చంద్రయాన్ వంటి ప్రయోగాలతో దేశాన్ని అగ్రరాజ్యంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిదే అని స్పష్టం చేశారు. అనంతరం జేసీ శ్రీరాములు రెడ్డికి కమల పత్ర అవార్డును ప్రదానం చేశారు. అవుట్ స్టాండింగ్ యంగ్ పర్సన్ అవార్డులను చంద్రయాన్-3లో ముఖ్యపాత్ర పోషించిన జిల్లాకు చెందిన సీహెచ్ శ్రీనివాసరావు, తహసీల్దార్ పసుపులేటి మురళి.. అవుట్ స్టాండింగ్ బిజినెస్‌మెన్ అవార్డును డాక్టర్ చావల ప్రకాష్, సిద్దా సుధీర్‌లకు అందజేశారు. ప్రొఫెషనల్ అవార్డును మహోగ్నాతో పాటు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రదానం చేశారు. ప్రముఖ సైకాలజిస్టు అభిషేక్ సింగంశెట్టి వివిధ పాఠశాలలకు చెందిన 1000 మంది విద్యార్థులకు సక్సెస్ మంత్రలో శిక్షణ ఇచ్చారు. ప్రెసిడెంట్ పులి రామాంజనేయులు, జేసీ వీక్ చైర్మన్ జాహ్నవి జనార్దన్, సిద్దా సూర్య ప్రకాషరావు, డాక్టర్ మురళీధర్ రెడ్డి, ఆవుల రమణారెడ్డి, డాక్టర్ రవి కుమార్, నైనాల రామకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు హరిప్రసాద్, శేఖర్ బాబు, ఏడుకొండలు, వీవీ రమణ పాల్గొన్నారు. కె.నాగేశ్వరరావు, సోమినేని సురేష్, ఏ.శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అక్రమ గోవా మద్యం విక్రయం

- సెబ్ పోలీసుల అదుపులో టీడీపీ, జనసేన నాయకులు..?

కనిగిరి రూరల్: అక్రమ గోవా మద్యం అమ్మకాలు చేస్తున్న ముగ్గురు యువకులను శనివారం రాత్రి సెబ్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. కనిగిరి మండలం అడ్డరోడ్డులో గోవా మద్యం బాటిళ్లను అమ్మకాలు చేస్తున్న జనసేన, టీడీపీలకు చెందిన ముగ్గురుని సెబ్ సీఐ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి సుమారు రూ. లక్ష విలువైన బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు అదుపులో ఉన్న వారిలో జనసేన పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు, టీడీపీ నాయకులు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా సెబ్ జిల్లా అధికారులు ఒంగోలు అక్రమ గోవా మద్యం అమ్మకాలు చేస్తున్న కొందర్ని పట్టుకున్నారు. కనిగిరి మండలం అడ్డరోడ్డు అడ్డాగా జరుగుతున్నట్లు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కనిగిరి సెబ్ సీఐ దాడి చేసి ముగ్గురు యువకులను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

19 నుంచి డీఈడీ సెమిస్టర్ పరీక్షలు

ఒంగోలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ 2022-24 మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఈనెల 19 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు శనివారం తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు మైనంపాడులోని డైట్ కాలేజీలో ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. 2021-23 బ్యాచ్‌లో నాలుగో సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటలవరకు మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- అడవి పందులు అడ్డుగా రావడంతో ద్విచక్రవాహనం బోల్తా
- ఒకరు మృతి


కుడుముల అంకన్న (ఫైల్)

పెద్దదోర్నాల: అడవి పందులు అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం బోల్తా పడి వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఎంఎన్ఓ(మేల్ నర్సింగ్ ఆర్డర్లీ) మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గణపతి చెక్ పోస్టు సమీపంలో శనివారం జరిగింది. ఈ సంఘటనలో చింతలకు చెందిన ఎంఎన్ఓ కుడుముల అంకన్న(50) మృతి చెందగా, అతని అల్లుడైన పులిచర్ల వీరన్నకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై అంకమరావు ప్రమాద సంఘటనకు చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసుల కథనం మేరకు..స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎన్ఓగా విధులు నిర్వహించే అంకన్న శనివారం విధులకు హాజరయ్యేందుకు స్వగ్రామమైన చింతల గిరిజన గూడెం నుంచి అల్లుడు వీరన్నతో కలిసి ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి బయలుదేరాడు. ఈ క్రమంలో శ్రీశైలం రహదారిలోని పెద్దమూల టర్నింగ్ సమీపంలోకి రాగానే వీరి వాహనానికి అడ్డుగా అడవి పందుల గుంపు అడ్డుగా వచ్చాయి. దీంతో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సంఘటనను తెలుసుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రుడిని పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్య సిబ్బంది క్షతగాత్రుడిని వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో మార్కాపురం తరలించారు. తీవ్ర రక్తస్రావానికి గురైన అంకన్నను మార్కాపురం వైద్యశాలకు తరలించగా క్షతగాత్రుడిని పరిశీలించిన సిబ్బంది గుంటూరుకు తీసుకెళ్లాలని సూచించగా..అక్కడ వెళుతుండగా మార్గమధ్యంలో త్రిపురాంతకం వద్ద మృతి చెందాడు. దీంతో అంకన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై అంకమరావు ప్రమాదానికి సంబంధించిన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.


సంఘటనా స్థలంలో తీవ్రంగా గాయపడిన అంకన్న

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌కు దర్శి గురుకుల విద్యార్థులు

దర్శి: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు దర్శి గురుకుల పాఠశాల విద్యార్థులు పి. కాశీబాబు(గ్రీవర్‌రోమన్), ఏ జోసఫ్ (ఫ్రీస్టైల్) ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ మాధవరావు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు శిక్షణ ఇచ్చిన పీఈటీ బొడ్డు సుబ్బారావును అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.రాజశేఖర్, కె. నారాయణరాజు, జీఎల్ హౌస్ మాస్టర్, డి.ఇన్నయ్య పాల్గొన్నారు.

బాబుకు మంద కృష్ణ మద్దతు ఇవ్వడం సరికాదు

కంభం: ఆంధ్రప్రదేశ్‌లోని మాదిగల అస్తిత్వాన్ని అధః పాతాళానికి తొక్కిన చంద్రబాబుకు మంద కృష్ణ మాదిగ మద్దతివ్వడం సమంజసం కాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పానుగంటిపాలెం రాజు అన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నేరం రుజువైతే చట్టాలు, కోర్టులు శిక్ష వేస్తాయని, నేరం రుజువుకాక పోతే తన నిజాయితీ నిర్ధారణ అవుతుందన్నారు. ఈ క్రమంలో ఆయన అరెస్టు అప్రజాస్వామ్యమని మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపుకు సైతం మద్దతు పలకడం విచక్షణ రహితంగా భావిస్తున్నామన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్నప్పుడు ఏపీలో మాదిగలు లేరని మాదిగల అస్తిత్వాన్ని తొక్కి మాదిగల విధ్వంసానికి పాల్పడ్డారన్నారు. అలాంటికి వ్యక్తికి మాదిగల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే విధంగా మంద కృష్ణ మద్దతు ఇవ్వడ ఏపీ మాదిగలను అవమానపరచడమేనన్నారు. ఆనాడు పాదయాత్రలో ముగ్గురు ఎమ్మార్పీయస్ కార్యకర్తలు ప్రాణాలు పోగొట్టుకుంటే వర్గీకరణ చేసి వారి రుణం తీర్చుకుంటానని మాట ఇచ్చి తప్పినందుకు చంద్రబాబు మద్దతు పలకాలా అని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బొడిచెర్ల రాజు, నేదరపల్లి జయరాజ్, గోన మోహన్‌రావు, కాకర్ల మనోజ్ కుమార్, భాస్కర్, ప్రభాకర్, కొత్తపల్లి శ్యాం, యేసు, పోలయ్య, మైకేల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాలెంరాజు

మద్యం తరలిస్తున్న ఆటో స్వాధీనం

మద్దిపాడు: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆటోను శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని సన్నమూరు గ్రామానికి చెందిన కానాల ఏడుకొండలు ఆటోలో ఆదే గ్రామానికి చెందిన రావిశెట్టి పద్మ 40 మద్యం బాటిల్స్‌ను అక్రమంగా ఆటోలో తరలిస్తున్నారు. ఎస్ఐ శివబసవరాజు తమ సిబ్బందితో అయ్యవారుపాలెం, సన్నమూరు గ్రామాల మధ్య ఆటోను అదుపులోకి తీసుకున్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు